సాక్షి చిత్తూరు
మంగళవారం । 29 । జూలై । 2025



అయ్యా.. న్యాయం చేయండి

కాళ్లరిగేలా తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదయ్యా.. అంటూ పలువురు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. - 8లో



102 వాహనం.. హోటల్‌కు వాడకం!

ఓ వ్యక్తి 102(తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్) వాహనాన్ని ఎంచక్కా తన హోటల్‌కు వినియోగించకోవడంతో అతనిపై వేటు పడింది. - 8లో



'హిమ'విజయం!

పలమనేరు నియోజకవర్గం, బైరెడ్డిపల్లె మండలానికి చెందిన హిమసాగర్ పట్టుదలకు మారుపేరుగా నిలిచారు. - 8లో

న్యూస్‌రీల్

పోష్ చట్టంపై విస్తృత అవగాహన



పోష్ చట్టం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిష్కారానికి అమలు చేస్తున్న పోష్ చట్టంపై క్షేత్ర స్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి ఆధ్వర్యంలో పోష్ చట్టానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోష్ చట్టం అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. రెగ్యులర్, పార్ట్ టైమ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఈ చట్టాన్ని వివరించాలన్నారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడల్, డీఆర్‌వో మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

బోయకొండ హుండీ ఆదాయం రూ.77.83 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.77.83 లక్షలు వచ్చినట్టు ఈఓ ఏకాంబరం తెలిపారు. ఈ మేరకు సోమవారం హుండీ లెక్కింపు చేపట్టగా నగదు రూ.77,83,633, బంగారం 21 గ్రాములు, వెండి 394 గ్రాములు వచ్చినట్టు పేర్కొన్నారు. విదేశీ కరెన్సీ నోట్ల తోపాటు రణభేరి గంగమ్మ ఆలయంలో గల హుండీ ద్వారా రూ.57,057 నగదు లభించినట్లు వెల్లడించారు. ఈ ఆదాయం 35 రోజులకు సమకూరిందన్నారు. చిత్తూరు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ, ఆలయ, బ్యాంకు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపేక్షించొద్దు



నరహరిపేట చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న డీసీ విజయశేఖర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా సరిహద్దు రాష్ట్రాలకు దగ్గరగా ఉండడంతో ఇటువైపు ఎక్కడా కూడా మాదక ద్రవ్యాలు రావడానికి వీల్లేదని చిత్తూరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ ఆదేశించారు. సోమవారం చిత్తూరు–వేలూరు రోడ్డులోని నరహరిపేట వద్ద ఉన్న ఎక్సైజ్ శాఖ చెక్ పోస్టును ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. నాటుసారా, గంజాయి, కల్తీ మద్యం లాంటివి ఏవీ కూడా జిల్లాలోపలకు రావడానికి వీల్లేదన్నారు. నిత్యం అధికారులు తనిఖీలను ముమ్మరం చేయడం ద్వారానే అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చన్నారు. డీసీ వెంట సీఐ రవి కుమార్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

జీవన ఎరువులతో ఆరోగ్యకరమైన పంటలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: ఆరోగ్య కరమైన పంట దిగుబడికి రైతులు జీవన ఎరువులు వినియోగించాలని జిల్లా వనరుల కేంద్రం ఏఓ లక్ష్మీప్రసన్న సూచించారు. సోమవారం మండలంలోని చీకూరుపల్లెలో పంటల సాగులో తీసుకోవాల్సి జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పంటల సాగులో రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన పంటల దిగుబడి కోసం సేంద్రియ పద్ధతులను అనుసరించాలని చెప్పారు. అనంతరం రైతులకు కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. బంగారుపాళెం ఏఓ భారతి, సిబ్బంది సాయిజ, కుమార్ పాల్గొన్నారు.

3 నుంచి జిల్లా స్థాయి చెస్ పోటీలు

నగరి : జిల్లా స్థాయి చెస్ పోటీలు ఆగస్టు 3 నుంచి నిర్వహించనున్నట్టు లయన్స్ క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ ప్రభాకర్‌రాజు తెలిపారు. మండలంలోని వీకేఆర్‌పురం సమీపంలో గల హైవే గ్రాండ్ వోల్డ్ నందు ఈ పోటీలు జరుగుతాయన్నారు. 78వ స్వాతంత్య్ర దినోత్సవం, 28వ చెస్ అసోసియేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అండర్ 9, అండర్ 16, అబోవ్ 16 కేటగిరిలలో పోటీలు జరుగుతాయని, వివరాలకు 9440821444లో సంప్రదించాలని సూచించారు.

మామిడి రైతుల అవస్థలను కొందరు కూటమి నేతలు తమకు అనుకూలంగా మాలుచుకుంటున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహక నిధిని పక్కదారి పట్టించేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. ఇందులో భాగంగానే తొలుత తమిళనాడు రాష్ట్రానికి చెందిన కాయలను తెచ్చి జిల్లాలో అమ్మకానికి పెట్టారు. ఇది చాలదన్నట్టు ఇప్పుడు వే బిల్లుల పేరుతో మోసాలకు తెరలేపారు. ఫ్యాక్టరీలో కాయలు దింపకనే వే బిల్లులు సృష్టించి ప్రభుత్వ ప్రోత్సాహక నిధికి తూట్లు పొడుస్తున్నారు. దీనికితోడు నీలం కాయలను సైతం తోతాపురి లెక్కల్లోకి తీసుకుంటున్నారు. దీనిపై ఉద్యానశాఖ అధికారులు నోరెత్తకపోవడాన్ని రైతులు తీవ్రంగా తప్పుబడుతున్నారు.





నిధుల వేట!

మామిడి కొను'గోల్‌మాల్'!
- పక్కదారి పడుతున్న ప్రభుత్వ ప్రోత్సాహ నిధి
- వే బిల్లులు సృష్టించి యథేచ్ఛగా దందా!
- పట్టించుకోని ఉద్యానశాఖ అధికారులు

కాణిపాకం: జిల్లా వ్యాప్తంగా మామిడిలో తోతాపురి రకం 39,895 హెక్టార్లలో సాగులో ఉంది. మొత్తం ఈ సారి 4.99 లక్షల టన్నుల దాకా దిగుబడి వచ్చినట్టు అధికారుల అంచనా. ఈ పంట అధిక దిగుబడి కారణంగా కొనుగోలులో రైతులకు ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం తోతాపురి కిలోకి రూ.12 మద్దతు ధర ప్రకటించింది. ఈ ధరలో ఫ్యాక్టరీలు కేజీకి రూ.8 ఇస్తే.. ప్రభుత్వ ప్రోత్సాహ నిధి కింద కేజీకి రూ.4 చొప్పున్న చెల్లిస్తామని వెల్లడించింది. ఇదే అదునుగా భావించి కొందరు వ్యక్తులు, కూటమికి చెందిన పలువురు నేతలు ఆ ప్రోత్సాహక నిధిని దోచుకునేందుకు కుట్రలు పన్నుతున్నారు.

ఆ కాయలు ఏమయ్యాయి?

ప్రతి ఏటా మామిడి పంట ఆరంభంలోనే వ్యాపారులు తోటపై వాలిపోతుంటారు. రైతులకు అడ్వాన్స్‌లు ఇచ్చి ఒప్పందం కుదుర్చుకుని వెళ్లిపోతుంటారు. తమిళనాడుకు చెందిన వ్యక్తులే అధిక శాతం మంది ఈ వ్యాపారం చేస్తుంటారు. వీరు ఈ సారి తీవ్రంగా నష్టపోయారు. తోటపై కొనుగోలు చేసిన కాయలను అమ్ముకోలేక తలలు పట్టుకున్నారు. వీరికి కొందరు కూటమి నేతలు వల వేశారు. కాయలను అమ్మిచ్చే బాధ్యతను తీసుకున్నారు. ఆ కాయలను ఫ్యాక్టరీలకు దగ్గరుండి తరలించి.. ప్రోత్సాహక నిధిని వీళ్ల ఖాతాల్లోకి మళ్లించుకునేందుకు కుట్రలు పన్నారు.

ఒకే ట్రాక్టర్ పేరుతో పలు బిల్లులు

ఒకే ట్రాక్టర్..ఒకే రోజు పలు లోడ్లు తరలించి ప్రోత్సాహక నిధికి బిల్లులు సమర్పించుకున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇందుకు పలు ర్యాంపులు కేంద్ర బిందువుగా మారినట్టు విమర్శలు గుప్పుమంటున్నాయి. ఒకే ట్రాక్టర్ పలు ర్యాంపుల వద్దకు వెళ్లి కాయలను తూకం వేసి.. దింపకుండా.. బిల్లులు సృష్టించుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇదంతా ప్రభుత్వం అందించే రూ.4 ప్రోత్సాహక నిధి కోసమేనని రైతులు ఆరోపిస్తున్నారు. ర్యాంపుల వద్ద వచ్చిన ఆధార్, బ్యాంకు ఖాతా, వే బిల్లులను తీసుకొచ్చి సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారనే విషయం జోరుగా ప్రచారం సాగుతోంది. ఇలాంటివి కుప్పం, వి.కోట, పలమనేరు, సోమల ప్రాంతాల్లో జరుగుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా ఉద్యానశాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

నీలంతో ఏంపని?

మూడు రోజుల క్రితం వరకు 26,221 మంది రైతులు 2,26,660 మెట్రిక్ టన్నుల కాయలను ఫ్యాక్టరీలకు విక్రయించారు. ర్యాంపుల ద్వారా 14,637 మంది రైతులు 1,01,175 టన్నుల కాయలను విక్రయించినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. అయితే తోతాపురి పంట దాదాపు పూర్తికావొచ్చింది. ఇప్పుడు నీలం రకం కాయలు మాత్రమే కోతలు, అమ్మకాలు జరుగుతున్నాయి. వీటిని కొన్ని ర్యాంపుల్లో తోతాపురి లెక్కల్లోకి నెట్టేస్తున్నారు. ఇవన్నీ కూడా పలువురు ర్యాంపు నిర్వాహకులు నేర్పుతున్న పాఠమని రైతులు అంటున్నారు. దీనిపై అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతోనే ఈ రకమైన దందా నడుస్తోందని, ప్రభుత్వం అందించే రూ.260 కోట్లలో.. రూ.50 కోట్లు మామిడిలో జరిగిన దందాకు సరిపోతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపడితే మామిడి దందా బట్టబయలవుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

దందా ఇలా

మామిడి అవస్థలను కొందరు కూటమి నేతలు తమకు అనుకూలంగా మార్చుకుని క్యాష్ చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రజాప్రతినిధుల పేరు చెప్పుకొని టోకన్లను సైతం అమ్ముకున్నట్టు తెలుస్తోంది. అధికారుల రంగ ప్రవేశంతో దీనిని కట్టడి చేశారు. ఆ తర్వాత తమిళనాడు రాష్ట్రం నుంచి తోతాపురి మామిడిని జిల్లాలోని ఫ్యాక్టరీలకు తరలించి సొమ్ము చేసుకున్నారు. మామిడి పంటే లేని వ్యక్తులు అక్కడి కాయలను తీసుకొచ్చి జిల్లాలోని ఫ్యాక్టరీలో విక్రయానికి పెట్టారు. ఇలా సుమారు 60 వేల మెట్రిక్ టన్నుల నుంచి 90 వేల మెట్రిక్ టన్నుల కాయలు ఫ్యాక్టరీల్లోకి దింపినట్టు రైతులు చెబుతున్నారు. ఈ దందాలో కూటమికి చెందిన పలువురు కార్యకర్తలు ముందు వరుసలో నిలిచారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆ తర్వాత పోలీసులు అప్రమత్తమై తమిళనాడు సరిహద్దులో నిఘా పెట్టారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 36 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని జిల్లా ఆర్మడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 36 ఫిర్యాదులు అందాయి. సోమవారం ఎస్పీ మణికంఠ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో కుటుంబ తగాదాలు, వేధింపులు, డబ్బు తగాదాలు, భూ తగాదాలు, ఆస్తి తగాదాలకు సంబంధించినవి ఉన్నాయి. వచ్చిన ప్రతీ ఫిర్యాదుపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి వాటిని పరిష్కరించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. అలాగే పలువురు పోలీస్ అధికారులతో వీడియో సమావేశం నిర్వహించి, బాధితుల సమస్యలపై చర్చించారు. ఇక డీటీసీ డీఎస్పీ రాంబాబు సైతం ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు.

3న బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

శ్రీకాళహస్తి: పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాల మైదానంలో ఆగస్టు 3వ తేదీ ఉదయం 8 గంటలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సబ్ జూనియర్స్, సీనియర్స్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బాలాజీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో క్రీడాకారులు జనవరి 2, 2010 తరువాత జన్మించి ఉండాలన్నారు. సెలెక్షన్‌కు వచ్చే క్రీడాకారులు తమ వెంట ఆధార్, బ్లడ్ గ్రూప్ తప్పని సరిగా తీసుకురావాలన్నారు. డ్రెస్‌కోడ్ పాటించాలని తెలిపారు. ఎంపికలో చిత్తూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటస్వామి, చైర్మన్ జగన్నాథంనాయుడు, అసోసియేషన్ సభ్యులు పాల్గొంటారని చెప్పారు. మరిన్ని వివరాలకు 7013754776, 9848295471 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- చికిత్స కంటే నివారణే మేలు
- ప్రతి శుక్రవారం కచ్చితంగా డ్రై డేని పాటించాలి
- మామిడి రైతులకు రూ.150 కోట్ల సబ్సిడీ
- సమావేశాల్లో కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ



డెంగ్యూ నివారణ అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా కట్టడి చేసేందుకు వైద్య ఆరోగ్య, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన వరుస సమావేశాలను నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటికే కొన్ని డెంగ్యూ కేసులు నమోదైనట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే అమలు చేయాలన్నారు. అనంతరం జాతీయ డెంగ్యూ నివారణ మాసాన్ని పురస్కరించుకుని అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సుధారాణి, జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు పాల్గొన్నారు.

పకడ్బందీగా మామిడి సబ్సిడీ పంపిణీ

జిల్లా వ్యాప్తంగా మామిడి రైతులకు రూ.150 కోట్ల సబ్సిడీని అందజేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మామిడి సబ్సిడీ అందజేసేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటి వరకు సేకరించిన మామిడికి కిలో రూ.4 చొప్పున సబ్సిడీ అందజేయనున్నట్లు తెలిపారు. ఆగస్టులో సంబంధిత రైతుల ఖాతాల్లోకి సబ్సిడీ నగదు జమచేస్తామన్నారు. 2.25 లక్షల మెట్రిక్ టన్నుల మామిడికి సంబంధించి 28,370 మంది రైతుల డేటాను పరిశీలన నిమిత్తం మండల స్థాయి బృందాలకు పంపినట్టు తెలిపారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి, వ్యవసాయ శాఖ జేడీ మురళీకృష్ణ, మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్ పాల్గొన్నారు.

పోటీతత్వంతో ముందుకు సాగాలి

- రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు 28 మంది ఎంపిక



జిల్లా స్థాయి పోటీల్లో బహుమతులు పొందిన విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : పోటీల్లో పాల్గొనే విద్యార్థులు, క్రీడాకారులు పోటీతత్వంతో ముందుకు సాగాలని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ చిత్తూరు సెక్రటరీ యుక్తాచౌదరి అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానం ఇండోర్ స్టేడియంలో సోమవారం జిల్లా స్థాయి యోగాసన క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి 236 మంది విద్యార్థులు, యోగా క్రీడాకారులు పాల్గొన్నారు. పాల్గొన్న వివిధ వయస్సుల క్రీడాకారులు యోగా పోటీల్లో వివిధ ఆసనాలను వేశారు. జిల్లా స్థాయిలో 28 మంది గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు యుక్తాచౌదరి మాట్లాడుతూ ఎంతో ప్రాముఖ్యత ఉన్న యోగాను మరింత అభివృద్ధి చేసేందుకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీలకు బాపట్ల జిల్లా నుంచి విచ్చేసిన సంతోష్‌కుమార్ అబ్జర్వర్‌గా వ్యవహరించారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన యోగా క్రీడాకారులు త్వరలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేసి అభినందించారు. ఈ పోటీల్లో అసోసియేషన్ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులు మురళీ మోహన్ పాల్గొన్నారు.

ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి!

- ఊరుగాని ఊరులో అనాథగా మట్టిలో కలిసిన కన్నడ వాసి
- కన్నీరుమున్నీరైన కుటుంబీకులు



ఆదివారం బత్తెప్ప మృతదేహానికి అంతిమ సంస్కారాలు చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

పలమనేరు: ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి ఏ మట్టిలో కలిసిపోతామో తెలియని మానవ జన్మ ఇది. ఇలాంటిదే పలమనేరులో చోటు చేసుకుంది. కర్ణాటక వాసి ఇక్కడ అనాథలా మృతిచెందడం.. ఆపై మట్టిలో కలిసిపోవడం చూసి కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. వివరాలు.. ఈనెల 23వ తేదీన పలమనేరు సమీపంలోని పత్తికొండ వద్ద హైవేకి సమీపంలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న గంగవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆపై బంధువుల రాక కోసం మూడు రోజుల దాకా వేచి చూశారు. కానీ ఎవ్వరూ రాకపోవడంతో స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ వారిద్వారా అంతిమ సంస్కారాలకు అప్పగించారు. వారు పట్టణంలోని హరిశ్చంద్ర శ్మశాన వాటికలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు.



హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుతున్న మృతుని కుటుంబ సభ్యులు

అయ్యో..అనాథలా వెళ్లిపోయావా నాయనా?

ఇలా ఉండగా మృతుని బంధువులు సోమవారం పోలీసుల వద్దకు వచ్చారు. తాము కోలారు జిల్లా, ఈకాంబలి గ్రామానికి చెందిన వారమని, మృతుని పేరు బత్తెప్ప(55) అని తెలిపారు. ఈనెల 23 నుంచి కనిపించకపోవడంతో కోలారు పీఎస్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఆయనకు కాలు దెబ్బతగిలి బాధతో ఆత్మహత్య చేసుకొని ఉంటాడని, దీనిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవన్నారు. ఆయన అనాథ కాదని, కుటుంబీకులున్నారంటూ బంధువులు బోరున విలపించారు.

ఇక్కడే పెద్ద ఖర్మ చేస్తాం

అనంతరం హెల్పింగ్‌హ్యాండ్స్ నిర్వాహకులు శివ మిత్ర బృందంతో మాట్లాడారు. వారు మృతదేహానికి ఎలా అంత్యక్రియలు నిర్వహించారో వీడియో చూపెట్టారు. దినిపై సంతృప్తి చెందిన కుటుంబీకులు ఆయన ఇక్కడి మట్టిలో కలవాలని దేవుడు రాశాడని.. పెద్దఖర్మ కూడా ఇక్కడే చేస్తామని తెలిపారు. హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులకు చేతులు జోడించి కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ ఘటన స్థానికులకు కన్నీళ్లు తెప్పించింది.

భావి ఇంజినీర్లుగా ఎదగాలి



మాట్లాడుతున్నఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు : తిరుపతి ఐఐటీలో నూతనంగా బీటెక్ కోర్సుల్లో చేరిన విద్యార్థులు బాగా చదువుకుని భావి ఇంజినీర్లుగా ఎదగాలని ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎన్ సత్యనారాయణ ఆకాంక్షించారు. సోమవారం ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో యువంతర్– 2025 ఓరియంటేషన్ నిర్వహించారు. డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ కొత్త విద్యార్థులకు సంస్థ సంస్కృతి, విద్యా చట్టం, సౌకర్యాలను వివరించారు. ఈ ఏడాది మొత్తం 254 మంది విద్యార్థులు బీటెక్ ప్రవేశం పొందినట్లు వెల్లడించారు. విద్యా వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ రామకృష్ణ గోర్తి మాట్లాడుతూ విద్యాసంస్థ నిబంధనలను వివరించారు. విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ ఎన్ ఎస్ మూర్తి మాట్లాడుతూ కళాశాల జీవితం, విద్యార్థుల సౌకర్యాలు, అందుబాటులో ఉన్న పాఠ్యేతర అవకాశాలను తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 85,486 మంది స్వామిని దర్శించుకున్నారు. 30,929 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.85 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని వారికి 12 గంటలు పడుతోంది.

కాణిపాకం హుండీ ఆదాయం రూ.1.81 కోట్లు



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన హుండీని సోమవారం ఆలయ అధికారులు లెక్కించారు. ఈవో పెంచల కిషోర్ పర్యవేక్షణలో జరిగిన ఈ హుండీ లెక్కింపులో రూ.1,81,84,138కోట్ల ఆదాయం వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా రూ.21,032, నిత్యాన్నదానం హుండీ ద్వారా రూ.53,031లు వచ్చింది. యూఎస్ఏవి 2488 డాలర్లు, ఇంగ్లండ్‌వి 5 పౌండ్స్, యూఏఈ 230 దిర్హామ్స్, యూరోవి 20 యూరోలు, కెనడావి 55 డాలర్స్ వచ్చాయి. బంగారం 40 గ్రాములు, వెండి 790 గ్రాములు భక్తులు కానుక రూపంలో సమర్పించుకున్నారు. ఏఈవోలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ధనంజయ, ప్రసాద్, నాగేశ్వరరావు, కోదండపాణి, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ.. ఉద్యోగ అవకాశం



అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ శిక్షణ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ శిక్షణ కార్యక్రమం పట్ల క్షేత్ర స్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చదివిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 7వ తేదీ ఆఖరు అని చెప్పారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడల్, డీఆర్‌వో మోహన్‌కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ శాఖ పరిధిలో నిర్వహిస్తున్న వన్ స్టాప్ సెంటర్‌లో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నట్టు ఆ శాఖ పీడీ వెంకటేశ్వరి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అర్హత ఉన్న నిరుద్యోగ అభ్యర్థులు వన్ స్టాప్ సెంటర్‌లో పనిచేసేందుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. బీసీ-సీకి చెందిన మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 7లోపు కలెక్టరేట్‌లోని ఐసీడీఎస్ శాఖలో దరఖాస్తులను అందజేయాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె సూచించారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్యాయత్నం

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని పత్రాంపల్లెలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీల ఘర్షణలో కలత చెందిన ఓ వివాహిత విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పత్రాంపల్లెకు చెందిన రామ్మూర్తి, సతీష్ కుటుంబానికి ఆర్థికపరమైన గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం రామ్మూర్తి భార్య తారక అనే మహిళపై సతీష్ కుటుంబ సభ్యులు దాడికి పాల్పడ్డారు. ఇరువర్గాలు గొడవ పడడంతో.. కలత చెందిన తారక విషం తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. వెంటనే స్థానికులు ఆమెను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. టూటౌన్ పోలీసులు విచారిస్తున్నారు.

బకాయిలు వసూలు చేయండి



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్ఈ

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా పరిధిలో ఎస్సీ, ఎస్టీ బకాయిల మీద దృష్టి పెట్టాలని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం అర్బన్ డివిజన్ కార్యాలయంలో ఈఈ మునిచంద్ర, ఈఆర్ఓ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ సర్వీస్ ధరలకు ప్రభుత్వం ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్ ఇస్తోందన్నారు. 200 యూనిట్లు దాటినవారు బిల్లు చెల్లించాలన్నారు. కానీ పలువురు బిల్లులు చెల్లించడం లేదన్నారు. ఎక్కువగా చిత్తూరు రూరల్, జీడీనెల్లూరు ప్రాంతాల్లో ఈ సమస్య ఉందన్నారు. ఆ సర్వీసుల పెండింగ్ అమౌంట్ వసూలు చేయాలన్నారు. డివిజన్ పరిధిలో డిస్ కనెక్ట్ అయిన 163 సర్వీస్‌ల నుంచి పెండింగ్ మొత్తం రాబట్టాలన్నారు. లేనిపక్షంలో ఆ సర్వీసులను రద్దు చేయాలన్నారు.

ఒకరికి పదేళ్ల జైలు



ముద్దాయిని తరలిస్తున్న కానిస్టేబుళ్లు

పుంగనూరు: పాత కక్షలు పెంచుకొని యువకుడిని కత్తితో పొడిచిన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష, రూ.30 వేల జరిమానా విధిస్తూ మదనపల్లె 7వ అదనపు జిల్లా జడ్జి శ్రీలత తీర్పునిచ్చారు. సోమవారం పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పుంగనూరు పట్టణం, నక్కబండలో 2022 జూన్ 25న అదే ప్రాంతానికి చెందిన టీ.రెడ్డెప్ప కుమారుడు రాజా అలియాస్ తోటి రాజేష్ స్థానిక ఇస్లాం నగర్‌కు చెందిన ఫారుక్‌తో ఓ అమ్మాయి విషయమై గొడవ పడ్డాడు. ఆపై నక్కబండ వద్ద జరిగిన పంచాయితీలో ఫారుక్ ను చంపాలనే ఉద్దేశంతో తన వద్ద ఉన్న కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై అదేరోజు అప్పటి ఎస్ఐ మోహన్‌కుమార్ కేసు నమోదుచేసి రాజా అలియాస్ తోటి రాజేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో భాగంగా ఈనెల 28న మదనపల్లె 7వ అడిషనల్ జిల్లా కోర్టులో న్యాయమూర్తి శ్రీలత తీర్పు ప్రకటించారు. రాజా అలియాస్ రాజేష్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ.30 వేల జరిమానా విధించారు.

అయ్యా.. న్యాయం చేయండి

- కలెక్టరేట్‌కు క్యూ కట్టిన ఫిర్యాదుదారులు
- వివిధ సమస్యలపై 289 వినతుల స్వీకరణ

చిత్తూరు కలెక్టరేట్ : క్షేత్రస్థాయి అధికారుల వద్దకు ఎన్ని సార్లు వెళ్తున్నా తమకు న్యాయం జరగడం లేదని.. తమరైనా కల్పించుకుని న్యాయం చేయండంటూ పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడెల్, డీఆర్వో మోహన్ కుమార్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అందజేసిన ప్రతి వినతినీ పరిష్కరించాలని చెప్పారు.

1.40 ఎకరాలను తగ్గించేశారు

'నా కుమారుడు పేరుతో ఆన్‌లైన్‌లో నమోదై ఉన్న 3.06 ఎకరాలను 1.4 ఎకరాలను తగ్గించి మరొకరి పేరు పై మా భూమిని రెవెన్యూ అధికారులు మార్చేశారు' అని జీడీ నెల్లూరు మండలానికి చెందిన బాధితుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయనతో పాటు పలువురు బాధితులు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ గంగాధరనెల్లూరు



లంచం తీసుకుని తమ భూమిని మరొకరికి రాసిచ్చారని ఆవేదన వ్యక్తం చేస్తున్న వరత్తూరు గ్రామ బాధితులు

మండలం, వరత్తూరు రెవెన్యూ గ్రామం దళవాయిపల్లిలో తాము నివసిస్తున్నట్లు తెలిపారు. మండల వ్యవస్థ రాకముందు చిత్తూరు తాలూకా కార్యాలయం నుంచి రైతు పాసుపు స్తకం సర్వే నం .359–1 లో 3.06 ఎకరాలను మంజూరు చేసి ఉన్నారన్నారు. అనంతరం వంశపారంపర్యంగా కుమారుడైన తన పేరుతో పట్టా నం.585తో పాసుపుస్తకం ఇచ్చారని తెలిపారు. అనంతరం అనువంశికము విధానంలో తన పేరు మీద ఉన్న భూమిని కుమారుడైన ప్రవీణ్‌రెడ్డికి రాసివ్వగా



రోడ్డు వేయించాలని కోరుతున్న ఐరాల మండలం, అబ్బగుండు గ్రామస్తులు

1592 పాసుపుస్తకం ఇచ్చారని తెలిపారు. ఇటీవల మీభూమి వెబ్‌సైట్‌లో పరిశీలించగా 1.40 ఎకరాలే తగ్గించినట్లు గుర్తించామన్నారు. ఈ విషయం జీడీ నెల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన గోవిందరెడ్డికి చెందిన సర్వే నం.363/4 ఏలో 0.07 సెంట్లు, కమలమ్మకు చెందిన సర్వే నం.363/1 ఏలో 1.45 ఎకరాలు, సర్వే నం.363/2 ఏలో 0.1750 సెంట్లు, చంద్రారెడ్డికి చెందిన సర్వే నం.65/2 ఏలో 1.15 ఎకరాలు, ప్రవీణ్‌రెడ్డికి చెందిన సర్వే నం.359/1 ఏలో 1.41 ఎకరాలు మొత్తం 4.55 1/2 ఎకరాల భూమిని జీడీ నెల్లూరు తహసీల్దార్ కార్యాలయ అధికారులు ఎటువంటి భూమీలేని భానుప్రకాష్ అనే అతని పేరుపైకి మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడీ నెల్లూరు కార్యాలయంలో పనిచేసే వరత్తూరు వీఆర్వో సుబ్రహ్మణ్యం, ఆర్ఐ ఏకాంబరం, డీటీ తులసీరామ్, రిటైర్డ్ తహసీల్దార్ చంద్రశేఖర్ సదరు వ్యక్తి వద్ద రూ.15 లక్షలు లంచం తీసుకుని తమ భూమిని ఆయన పేరుపై మార్చేశారన్నారు. న్యాయం చేయాలని వారు కలెక్టర్‌ను వేడుకున్నారు.

రోడ్డు వేయించండి సారూ..

తమ గ్రామానికి రోడ్డు వేయించండి సారూ అంటూ ఐరాల మండలం, అబ్బగుండు గ్రామానికి చెందిన ప్రజలు వాపోయారు. ఈ మేరకు వారు పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ అబ్బగుండు గ్రామానికి రహదారి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పూర్వీకుల కాలం నుంచి తమ గ్రామానికి రహదారి లేదన్నారు. తమ గ్రామం నుంచి ఐరాల, చిత్తూరుకు నిత్యం పలువురు బతుకుదెరువుకు వెళ్తుంటారని.. ఉన్న రహదారి మొత్తం గుంతల మయం కావడంతో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని స్థితి ఉందన్నారు. తమ సమస్యను పలుమార్లు ఎమ్మెల్యే, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి న్యాయం జరగలేదన్నారు.

ఇళ్ల పట్టాలు ఇప్పించండి



ఇళ్ల పట్టాలు ఇప్పించాలని కోరుతున్న పూతలపట్టు మండలం, క్షీరసాగరం గ్రామస్తులు

ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న తమకు ఇళ్ల పట్టాలు ఇప్పించి న్యాయం చేయాలని పూతలపట్టు మండలం క్షీరసాగరం గ్రామస్తులు ధర్మతేజ, తేజోవతి, రమేష్, హేమలత కోరారు. వారు మాట్లాడుతూ క్షీరసముద్రం గ్రామంలో 49 కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. 2000లో అప్పటి అధికారులు ఇచ్చిన పొజిషన్ సర్టిఫికెట్ల ఆధారంగా ఇళ్లు నిర్మించుకున్నామన్నారు. తమకు ప్రభుత్వమే గృహాలను సైతం మంజూరు చేసిందన్నారు. తాము నివసిస్తున్న గృహాలకు పట్టాలు లేకపోవడంతో భద్రత లేకుండా పోయిందన్నారు. తమకు న్యాయం చేసి పట్టాలు ఇప్పించాలని అధికారులను వేడుకున్నారు.

శ్మశానానికి పట్టా ఇచ్చేశారంట సార్!



శ్మశానానికి పట్టా ఇచ్చినట్టు ఓ వ్యక్తి బెదిరిస్తున్నాడని చెబుతున్న ఐరాల మండలం, గోవిందరెడ్డిపల్లి ఎస్టీ కాలనీ వాసులు

తమ పూర్వీకులను ఖననం చేసిన శ్మశానానికి రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చారని శంకరయ్య అనే వ్యక్తి దౌర్జన్యం చేసి బెదిరిస్తున్నారని ఐరాల మండలం, గోవిందరెడ్డిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ తమ కాలనీకి సమీపంలో ఉన్న జొన్నకొప్పల బావి వద్ద ఉన్న పిల్లవంక స్థలాన్ని శ్మశానంగా ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఆ శ్మశానంలో తమ పూర్వీకులైన మురగయ్య, కుల్లయ్య, మురుగమ్మ, లక్ష్మయ్య, వెంకటరమణ, ధనలక్ష్మి, సాలమ్మ, చంద్రప్ప మృతదేహాలను పాతిపెట్టినట్టు వెల్లడించారు. రెండేళ్ల క్రితం కృష్ణయ్య అనే వ్యక్తిని కూడా అక్కడే పూడ్చి పెట్టి వచ్చిన తర్వాత గోవిందరెడ్డి పల్లి దళితవాడకు చెందిన శంకరయ్య ఆ శ్మశాన స్థలం తమకు పట్టా ఇచ్చారని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. కృష్ణయ్య మృతదేహం పూడ్చిన సమాధిని సైతం ధ్వంసం చేశారన్నారు. శ్మశాన స్థలంలో మట్టి తోలించి ఆ స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారన్నారు. ఉన్నతాధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని గిరిజనులు కోరారు.

'హిమ'విజయం!

'మనం మారుమూల గ్రామంలో ఉన్నాం.. మనకు పెద్ద ఉద్యోగాలు సాధ్యమేనా..? అని భయదొద్దు. మనం కూడా సాధిస్తాం..! అనే ధీమా ఉండాలి. ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. దాని కోసం శక్తివంచన లేకుండా కష్టపడాలి. అప్పుడే తప్పకుండా విజయం సొంతమవుతుంది'.. అంటున్నారు బైరెడ్డిపల్లికి చెందిన సెంట్రల్ కస్టమ్స్ అధికారి హిమసాగర్.. మనం ఏది సాధించాలో ముందుగా నిర్ణయించుకుని ఆ దిశగా ప్రయత్నించాలని చెబుతున్నారు. ఇంకా ఆయన ఏం చెప్పారంటే..

– పలమనేరు



విధుల్లో ఆర్ హిమసాగర్

- బైరెడ్డిపల్లి యువకుడు సెంట్రల్ కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్
- మారుమూల గ్రామం నుంచి ఉన్నత ఉద్యోగం

నేను కష్టాలు తెలిసిన వాడ్ని

మా తండ్రి కోదండ ఆచారి కార్పెంటర్. అమ్మ హౌస్‌వైఫ్. మా సోదరుడు ఫొటోగ్రాఫర్‌గా ఉన్నాడు. నేను మా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదు దాకా ఆపై జెడ్పీ హైస్కూల్‌లో టెన్త్ వరకు చదివా. ఇంటర్ పలమనేరులోని మధు కాలేజీ, ఆపై గూడూరులోని ఆదిశంకర ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్(ఈసీఈ) పూర్తి చేశా. ఆపై అందరిలాగే బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో నెట్‌వర్క్ ఇంజినీరుగా రెండేళ్లు పనిచేశా. కానీ సంతృప్తిలేదు. కచ్చితంగా సివిల్స్‌కు ప్రిపేర్ కావాలనుకున్నా. దీంతో అక్కడ జాబ్ మానేశా.

సివిల్స్ కోసమని హైదరాబాద్ వెళ్లా..

సివిల్స్ కోసమని హైదరాబాద్‌కు వెళ్లి అక్కడ ఓ కోచింగ్ సెంటర్‌లో ఆరు నెలలు కోచింగ్ తీసుకున్నా. అప్పుడు ఐఏఎస్ సాధించిన వారి వీడియోలు ఎక్కువగా యూట్యూబ్‌లో చూసేవాడ్ని. చాలామంది సొంత ప్రిపరేషన్‌తోనే సివిల్స్ సాధించారు. ఆ మాటలు, వీడియోలు నన్ను ప్రిపరేషన్ వైపు నడిపించాయి. ఓన్‌గానే ప్రిపేర్ కావాలనుకుని ఇంటికొచ్చి ప్రిపరేషన్ మొదలు పెట్టాను. సివిల్స్ రాశాగానీ అందులో వీలుకాలేదు. ఎస్ఎస్‌సీ(స్టాఫ్ సెలెక్షన్ కమిషన్) పరీక్షకు ప్రిపేర్ అయ్యాను. రెండు సార్లు విఫలమయ్యాను. మూడో ప్రయత్నంలో సీజీఎల్(కంబైన్డ్ గ్రాడుఓయయేషన్ లెవల్)ను దాటి ఉద్యోగం సాధించా.

ప్రిన్స్ అండ్ ప్రిన్సెస్ పోటీల్లో మెరిసిన రొంపిచెర్ల బాలిక



మాన్విత మాన్యకు టైటిల్ అందజేస్తున్న నిర్వాహకులు

రొంపిచెర్ల: తెలంగాణ రాష్ట్రంలో జరిగిన 2024–25 ప్రిన్స్ అండ్ ప్రిన్సెస్ ఆఫ్ తెలంగాణ పోటీలలో రొంపిచెర్ల మండలానికి చెందిన చిన్నారి మన్విత మాన్య మొదటి స్థానంలో నిలిచి టైటిల్ సొంతం చేసుకుంది. బండకిందపల్లె గ్రామ సచివాలయ సర్వేయర్ మానస కుమార్తె మన్విత మాన్య తిరుపతిలోని ఓ స్కూల్‌లో ఒకటవ తరగతి చదువుతోంది. ఈ నెల 27న హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జరిగిన ప్రిన్స్ అండ్ ప్రిన్సెస్ ఆఫ్ తెలంగాణ పోటీలలో పాల్గొని ప్రతిభ చాటింది. టైటిల్ విన్నర్‌కు బహుమతిలో పాటు వెబ్ సిరీస్ సినిమా చాన్స్ , యాడ్ షూట్ అవకాశాలు కల్పిస్తామని నిర్వాహకులు తెలిపారు.

102 వాహనం.. హోటల్‌కు వాడకం!

- డ్రైవర్ సస్పెన్షన్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాన్ని (102 వాహనం) హోటల్‌కు వాడుకుంటూ పట్టుబడిన డ్రైవర్‌ను సోమవారం సస్పెండ్ చేశారు. వివరాలు.. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ హేమంత్ చిత్తూరు మండలం, బీఎస్ఆర్‌పేట చెక్ పోస్టులో ఓ హోటల్ నడిపిస్తున్నాడు. ఈ హోటల్‌కు అవసరమైన సరుకులు, గ్యాస్ బండను 102 వాహనంలో తరలించేవాడు. ఇది సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యింది. దీన్ని కొందరు వ్యక్తులు బయట పెట్టారు. దీంతో అధికారులు విచారణ చేపట్టారు. ఈ విచారణ తర్వాత డ్రైవర్‌ను సస్పెండ్ చేశారు.

సర్వేయర్ సునీత బదిలీ

చిత్తూరు కలెక్టరేట్: గంగాధరనెల్లూరు మండల సర్వేయర్ సునీత పనితీరుపై పలు ఆరోపణలు రావడంతో ఆమెను కలెక్టరేట్‌లోని సర్వేశాఖ ఏడీ కార్యాలయానికి డిప్యూటేషన్ కింద బదిలీ చేస్తూ సోమవారం రాత్రి జేసీ విద్యాధరి ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో పాలసముద్రం సర్వేయర్ గణేష్‌కు గంగాధరనెల్లూరు మండల ఇన్‌చార్జ్ సర్వేయర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గంగాధరనెల్లూరు మండలంలో రైతుల భూముల సర్వేకు అధిక మొత్తాలు చెల్లించాలంటూ బహిరంగంగానే డిమాండ్ చేస్తున్నట్లు అక్కడి ఓ రైతు గత వారం కలెక్టర్‌ను కలిసి నేరుగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సర్వేయర్ సునీతపై చర్యలు తీసుకోవాలని జేసీ విద్యాధరిని కలెక్టర్ ఆదేశించారు. దీంతో సునీతను డిప్యూటేషన్ కింద సర్వేశాఖ ఏడీ కార్యాలయానికి బదిలీ చేశారు.

వరలక్ష్మీ వ్రతానికి విస్తృత ఏర్పాట్లు



ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న జేఈవో వీరబ్రహ్మం

చంద్రగిరి: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఆగస్టు 8న వరలక్ష్మీ వ్రతం నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. ఆయన సోమవారం తిరుచానూరులోని ఆస్థాన మండపంలో వరలక్ష్మీ వ్రతం ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆగస్టు 8వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వరలక్ష్మీ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో రూ.1000 చెల్లించి ఇద్దరు భక్తులు పాల్గొనవచ్చన్నారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారు స్వర్ణ రథంపై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారని వెల్లడించారు. వ్రతం సందర్భంగా అభిషేకం, అభిషేకానంతర దర్శనం, లక్ష్మీపూజ, కల్యాణోత్సవం, బ్రేక్ దర్శనం, ఊంజల్ సేవలను టీటీడీ రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక సౌకర్యాలు

భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని మరింత మెరుగైన ఏర్పాట్లు చేయాలని జేఈవో అధికారులను ఆదేశించారు. వరలక్ష్మి వ్రతాన్ని భక్తులు తిలకించేందుకు వీలుగా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేయాలని, తాగు నీరు, అన్నప్రసాదాలు విరివిగా పంపిణీ చేయాలని ఆదేశించారు. భక్తులకు పంపిణీ చేసేందుకు కుంకుమ ప్యాకెట్లు, కంకణాలు, గాజులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అమ్మవారి ఆలయం, ఆస్థాన మండపం, ఇతర ప్రాంతాల్లో పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించాలని సూచించారు. పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకుని ఆలయ పరిసరాలు, రోడ్లు, సమీప ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. ట్రాఫిక్, సెక్యూరిటీ సమస్యలు తలెత్తకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారం

వరలక్ష్మి వ్రతాన్ని ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆస్థాన మండపంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూ లైన్లు, ఆలయ పరిసరాల్లో పెండాల్స్, సూచిక బోర్డులు, ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబు స్వామి, మణికంఠ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఎస్ఈ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, అన్నదానం డిప్యూటీ ఈవో సెల్వం, వీజీవో సురేంద్ర పాల్గొన్నారు.

ఎంపీపీ ద్విచక్ర వాహనం చోరీ

శ్రీరంగరాజపురం : స్థానిక ఎంపీపీ ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన చిన్నతయ్యూరు గ్రామం వద్ద చోటుచేసుకుంది. ఎంపీపీ కథనం.. సోమవారం ఉదయం చిత్తూరు– పుత్తూరు జాతీయ రహదారి చిన్నతయ్యూరు గ్రామంలోని తన పొలం వద్ద ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశారు. ఆపై వ్యవసాయ మోటారు ఆన్‌చేసి వచ్చి చూడగా ద్విచక్ర వాహనం కనిపించలేదు. అనంతరం బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ పేర్కొన్నారు.

ప్రతి ఫైలూ పూర్తి చేస్తున్నాం

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రతిఫైల్‌నూ ఎప్పటికప్పుడు పూర్తి చేస్తున్నామని, ఒక్క ఫైల్‌ను కూడా పెండింగ్‌లో పెట్టడం లేదని మైనింగ్‌శాఖ ఉపసంచాలకులు పేర్కొన్నారు. ఇటీవల సాక్షి దినపత్రిలో 'అక్రమాల గనుడు' శీర్షికన వార్త వెలువడింది. దీనిపై స్పందించిన ఆయన పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. కార్యాలయంలో ఫైళ్ల పెండింగ్‌లను ఎప్పటికప్పుడు పూర్తి చేస్తున్నామన్నారు. గ్రానైట్ బండలు తరలిస్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. బిల్లులు లేకుండా తరలించే వాటిపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ రవాణాను అడ్డుకుంటున్నామని పేర్కొన్నారు.

స్కిట్ కళాశాలలో అడ్మిషన్లు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధంగా ఉన్న స్కిట్ కళాశాలను మూడు సంవత్సరాల కిందట ఆలయ ఆర్థిక భారంతో మూత వేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు స్కిట్ కళాశాల జేఎన్‌టీయూ, స్కిట్ అనుసంధానంతో సెల్ఫ్ ఫైనాన్స్ పద్ధతిలో ఇంజినీరింగ్‌కు సంబంధించిన విద్యార్థుల ప్రవేశానికి ఆన్‌లైన్‌లో అనుమతించారు. ఇందులో మొదటి సంవత్సరం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, సీఎస్ఈ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెంట్ అండ్ మెషన్ లెర్నింగ్, సీఎస్‌టీ(డేటా సైన్స్), ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ సంబంధించి 66 సీట్లు చొప్పున మొత్తం 330 సీట్లు అలాట్ చేసినట్లు ప్రకటించారు. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఒకో పోస్టుకు రూ.70 వేలుగా ఫీజు నిర్ణయించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, మంత్రి నారా లోకేష్ సహకారంతో కళాశాల ప్రారంభం చేసినట్లు ప్రకటించారు. దీనిపై స్కిట్ కళాశాల వద్ద మంగళవారం సంబరాలు చేసుకోనున్నట్లు తెలిసింది. అయితే కోర్టు కేసులు, నాన్‌టీచింగ్, టీచింగ్‌కు సంబంధించి 90 మంది గతంలో పనిచేసే వారుండగా వారిలో కొంతమంది కోర్టు స్టే తెచ్చుకోనున్నారు. అలాగే నాన్ టీచింగ్ కింద 36 మంది, 24 మంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేశారు. వారి పరిస్థితి ఏమిటన్నది వెల్లడి కావాల్సి ఉంది. జేఎన్‌టీయూ ఏ ప్రాతిపదికన స్కిట్ కళాశాలతో అనుసంధానం అయిందో అనే విషయంపై త్వరలోనే వెల్లడి కావాల్సి ఉంది.

పీ–4 పేరుతో నిర్బంధం సరికాదు



గిరిప్రసాద్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : పీ–4 కార్యక్రమం పేరుతో టీచర్లను నిర్బంధం చేయడం సరికాదని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. జీరో పావర్టీ (పీ–4) కార్యక్రమంలో టీచర్లు విద్యార్థి కుటుంబాలను తప్పనిసరిగా దత్తత తీసుకోవాలంటూ విద్యాశాఖ అధికారులు నిర్బంధం చేయడం సబబు కాదన్నారు. పీ–4 విధానంలో ప్రతి హెచ్ఎం కనీసం ఐదు కుటుంబాలను, టీచర్లు 2 కుటుంబాలను తప్పనిసరిగా దత్తత తీసుకుని ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయాలని ఒత్తిడి చేయడం అన్యాయమన్నారు.

ఎస్వీయూలో ఉద్యోగుల ముష్టియుద్ధం

- తీవ్రగాయాలతో రుయాలో చికిత్స
- ఆర్థిక లావాదేవీలతోనే ఒకరిపై ఒకరు దాడి

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఉద్యోగుల గొడవ రణరంగాన్ని తలపించింది. వర్సిటీలోని ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు సోమవారం పరిపాలనా భవనం ఎదుట ముష్టియుద్ధాన్ని తలపించేలా ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. తీవ్ర గాయాలపాలైన ఉద్యోగులు రక్తస్రావంతో రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాలలోకి వెళితే.. ఎస్వీయూ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్లుగా విధులు నిర్వహిస్తున్న సుబ్రమణ్యం, శ్రీనివాసరావు మధ్య కొంత కాలంగా ఆర్థిక లావాదేవీల విషయంలో గొడవలు జరుగుతుండేవని తోటి ఉద్యోగులు చెబుతున్నారు. ఇందులో భాగంగా సుబ్రమణ్యం అనే ఉద్యోగికి తోటి ఉద్యోగి శ్రీనివాసరావు రూ.2



రుయాలో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు

లక్షలు వరకు అప్పు ఉన్నాడని, గత రెండేళ్లుగా చెల్లించకుండా దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నాడని తెలిసింది. దీంతో పలుసార్లు సదరు ఉద్యోగి పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆర్థిక లావాదేవీలతో పాటు ప్రమోషన్ విషయంలో తనకే రావాలి..అడ్డు తగలవద్దు..అంటూ ఇద్దరి మధ్య తరచూ వాగ్వాదం నెలకొనేదని తెలిసింది. దీంతో సోమవారం వర్సిటీ ఆవరణలో ఇద్దరూ తారస పడిన నేపథ్యంలో ఆర్థిక లావాదేవీల కారణంతో పాటు ప్రమోషన్‌కు అడ్డువస్తున్నారనే కోపంతో వారిద్దరి మధ్య మాటా మాటా పెరిగి, ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకున్నారు. తోటి ఉద్యోగులు అక్కడికి చేరుకుని ఇద్దరినీ విడదీసే ప్రయత్నం చేశారు.

తీవ్ర గాయాలతో రుయాలో చేరిక

ఎస్వీయూ పరిపాలనా భవనం ఎదుట ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఉద్యోగులు తీవ్రగాయాలతో స్థానిక రుయాస్పత్రిలో చేరారు. శ్రీనివాసరావుకు తలపై గాయం కావడంతో వైద్యులు చికిత్స చేస్తున్నారు. అలాగే మరో ఉద్యోగి సుబ్రమణ్యంకు సైతం బలమైన లో గాయాలు తగలడంతో ప్రాథమిక చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేశారు. దీంతో ఇరువురు ఎస్వీయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.